# ఎందుకిలా...?

కథ

డా. తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

"మీరు ఎన్నయినా చెప్పండి. నేను మాత్రం మా ఆఫీసు వాళ్ళతో కలిసి వెళ్ళాలని వేసుకున్న ప్రోగ్రాం మాత్రం మానుకోను. ఎన్నాళ్ళ నుండో ఆంధ్రప్రదేశ్‌లోని పుణ్యక్షేత్రాలన్నీ దర్శించాలని ఆశ పడుతుంటే ఇప్పటికి ఆ అవకాశం దొరికింది. అమ్మా పెట్టా పెట్టదు. అడుక్కు తిననివ్వదు అన్నట్టు తీరా బయల్దేరే ముందు టికెట్ కాన్సిల్ చేసుకుని మీతో పెళ్ళికి రమ్మని బలవంతం చేయడం చాలా అన్యాయం. ఏదో అదృష్టం కొద్దీ ఆఖరిక్షణంలో తెలియబట్టి నాకు టికెట్టు దొరికింది తెలుసా?" కోపము, ఉక్రోషము, ఆవేశం కలిసికట్టుగా ధ్వనించాయి అహల్య గొంతులో.

బయట ఎండ చిటపటలాడుతోంది ఇంట్లో వాతావరణం లాగానే. ఈ తగాదా మొదలై మూడు రోజులైంది. అంతకు ముందురోజు దాకా చాల వుత్సాహంగా చీరలు ఇస్త్రీ చేయించుకోవడం, మ్యాచింగు జాకెట్లు, గాజులు సరి చూసుకోవడం లాంటి ప్రయాణ సన్నాహాలతో హడావుడి పడుతున్న అహల్యకు తన వంతు సహాయాన్ని చేస్తూ వచ్చిన గౌతమ్ ఆ పెళ్ళి కార్డు, దానితోపాటు ఉత్తరం రాగానే బాణీ మార్చాడు.

అది ఎవరో దూరపు బంధువుల ఇంట్లో పెళ్ళయితే అతను పట్టించుకునేవాడు కాదు. స్వయానా అతని మేనమామ కొడుకు కూతురి పెళ్ళి. అబ్బాయి అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాట్ట. వారం వ్యవధిలో పెళ్ళి చేయాలని అడిగార్ట. పిల్లకు అబ్బాయి నచ్చాడు. కట్నం ప్రసక్తే లేదు. అమ్మాయి కూడా బి.టెక్ కావడాన అమెరికాలో ఉద్యోగం సులభంగానే వస్తుంది. అందుకని సరే అనుకున్నార్ట. అహల్యను పిల్లలను తీసుకుని తప్పకుండా రావాలని గౌతమ్ మేనమామ ఉత్తరం కూడా రాసాడు.

'నా భార్య యాత్రలకు వెళ్ళింది' అంటూ పిల్లలను తీసుకుని తను వెళ్తే ఎంత నామర్దాగా వుంటుంది? విహార యాత్రనో, క్షేత్ర దర్శనమో మరొకసారి చేయవచ్చును. కానీ పెళ్ళి అలా కాదుకదా! అర్థం చేసుకోదేం అహల్య? అని గౌతమ్ ఆలోచన.

ఆ విషయంగానే ఆలుమగలిద్దరికీ ఆదివారం నాడు వేడివేడిగా వాగ్వాదం జరిగింది.

"సరే అయితే! నేనూ పెళ్ళికి వెళ్ళను. ఈ వంకన బంధువులందరినీ చూసి సరదాగా గడపవచ్చుననుకున్నాను. నా గురించి వాళ్ళంతా ఏమన్నా అనుకోనీ గానీ నువ్వు రాకండా నేను వెళ్తే అంతా నీ గురించి చెడుగా అనుకుంటారు. మొగుడి మాటన్నా, అతడి తరపు వారన్నా లక్ష్యం లేకపోబట్టే పెళ్ళికి రాకండా యాత్రలంటూ వెళ్ళిపోయింది అని కామెంట్ చేయడం నాకు ఇష్టం వుండదు" అనేసి అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

అహల్య పట్టుదలకుపోయి, ఎట్టి పరిస్థితిలోనూ తను వెళ్ళ దలచుకున్న టూరు మానుకోనని చెప్పడమైతే చెప్పింది గానీ తన నిర్ణయం సరైనదని ఆమె అంతరాత్మే ఒప్పుకోవడం లేదు.

చిన్న బుచ్చుకున్న గౌతమ్ ముఖం చూస్తే తను చేస్తున్నది తప్పనిపించింది అహల్యకు.

ఇది వరకు తన అక్క అనూరాధ ఆడ బడుచు కూతురి పెళ్ళి సమయంలో గౌతమ్‌కి ఇన్‌స్పెక్షన్ వుండడం వలన సెలవీయడం కుదరదన్నారు. 'భార్య వైపు బంధువులంటే తన భర్తకి పడదని, అందుకే రాలేదని' అందరూ అనుకుంటారేమో అని తను మధనపడింది. తను చిన్న బుచ్చుకోకూడదని సిక్ లీవ్ పెట్టి తెల్లవారు ఝామున బయల్దేరి వచ్చి పదింటికి ముహూర్తం కాగానే తిరుగు ప్రయాణమయ్యాడు గౌతమ్. ఆ విషయం అహల్యకు గుర్తుకొచ్చింది.


రాత్రి భోజనాలప్పుడు కూడా ముభావంగా వుండి పోయాడు గౌతమ్. 'యాత్రకు మరోసారి వెళ్ళచ్చు... పెళ్ళికి వెళ్ళకపోతే నలుగురిలో అతని గౌరవం దెబ్బతింటుంది' అనుకుంది అహల్య.

"సరే మీ మాట ప్రకారం పెళ్ళికి అందరం వెడదాం లెండి" అంది అహల్య.

గౌతమ్ ముఖం వికసించింది. "నిజంగానా? సారీ! నీవు టూర్‌కి వెళ్ళలేకపోవడం వలన చాల ఫీలవుతావని తెలుసు, కానీ ప్రామిస్! ఈసారి పిల్లల సెలవుల్లో మనందరం 'నిర్మల్ ట్రావెల్స్'లో బుక్ చేసుకుని నువ్వు చూడాలనుకున్న ప్రదేశాలన్నీ చూద్దాం. గోదావరి మీద పడవ ప్రయాణం కూడా" అన్నాడు గౌతమ్ సంతోషంగా. "మాట మీద నిలబడండి" అంది అహల్య నవ్వుతూ.

పెళ్ళి చిక్కడపల్లి వివాహ మందిరంలో. "మా అక్కావాళ్ళు వుండేది చిక్కడపల్లి త్యాగరాజు గాన సభ దగ్గరే కదా! అక్కడ దిగితే మనకు తిరగడానికి అనుకూలం"అంటూ ప్రతిపాదన పెట్టింది అహల్య.

తన మాట చెల్లించి పెళ్ళికి రావడమే గొప్ప



అనుకుని గౌతమ్ అభ్యంతరం చెప్పలేదు.

''ఇంత హఠాత్తుగా మా మీద గాలి మళ్ళిందే! ఏమిటి ఇంత దయ?'' చెల్లెల్ని గుమ్మం దగ్గరే కౌగలించుకుంటూ అడిగింది అనూరాధ.

''ఇదిగో ఈయన మేనమామ కొడుకు కూతురి పెళ్ళి వుంది రేపు. నేను రాకపోతే మర్యాదగా వుండదు అంటూ నా తల తినేసి తీసుకొచ్చారు'' అంది అహల్య నవ్వుతూ.

''అయితే లాభం ఎవరికట? చక్కగా మీ అక్కాబావలతో, పిల్లలతో నాలుగు రోజులు గడుపుతున్నావు కదా!'' అన్నాడు గౌతమ్.

''నేను మీ మాట కోసమే వచ్చాను. మీ కోసమే నా యాత్ర మానుకున్నాను. నాకిచ్చిన మాట మాత్రం తప్పకండి'' అంది అహల్య గౌతమ్ వైపు ప్రేమగా చూసి. అతన్ని నొప్పించలేకపోవడం ఆమె బలహీనత.

''నీ యాత్ర మానుకోవడమేవిటి? మరిది గారి ప్రామిస్ ఏమిటి? మాకంతా పజిల్‌లా వుంది'' అంది అనూరాధ ఇద్దరి వైపు చూస్తూ.


''ముందు మాకు కాఫీ, తిండి ఏర్పాటు చేస్తే ఆ వివరాలన్నీ చెబుతాను'' అని గదిలోకి వెళ్ళి కాళ్ళు కడుక్కొచ్చింది అహల్య.

అంతలో అనూరాధ భర్త వినయ్ రావడంతో అందరూ కబుర్లలో పడ్డారు.

గౌతమ్ సరదా పడినట్టుగానే పెళ్ళిలో బంధువులందరినీ పలకరించి సరదాగా గడిపాడు.

'తన సహోద్యోగులందరూ ఈ సరికి గుళ్ళూ గోపురాలు తిరుగుతుంటారు. ఎంతైనా కుటుంబంతో కలిసి చేసే ప్రయాణాలు వేరు-స్నేహితులతో టూర్లు వేరు. ఆ సరదా అంతా తను ఈ పెళ్ళి వలన మిస్ అయిపోయింది. కదా!' అన్న ఆలోచన మనసులో మెదిలినప్పుడు కాస్త దిగులుపడినా గౌతమ్ ముఖంలో కనబడుతున్న సంతోషం చూసి మనసుకు సరి పెట్టుకుంది అహల్య.

అంతా సంతోషంగా గడిచిందనుకుంటున్న సమ





యంలో అనుకోని విధంగా ప్రమాదం పాలైంది అహల్య. పెళ్ళినాటి సాయంత్రం రిసెప్షన్ సమయంలో ఎవరినో పలు కరించడానికి మెట్లు దిగి వెళ్తూ మెట్ల మీద పరచిన కార్పెట్ అంచు కాళ్ళకు అడ్డుపడి మెట్ల మీద నుండి క్రింద పడింది అహల్య.

'అమ్మో' అంటూ లేవలేక కాళ్ళు మడతబడి కూర్చుండి పోయింది. నిముషాలలో కాలు మడమపై భాగం ఇంతెత్తున వాచిపోయింది. నొప్పి భరించలేక ఏడ్చేస్తోంది అహల్య.

పరుగున అక్కడికి వచ్చిన గౌతమ్ భార్యను చంటిపిల్లను ఎత్తుకున్నట్టు రెండు చేతులతో ఎత్తుకుని గేటు బయట వున్న వినయ్ కారులో వెనుక సీటులో పడుకోబెట్టాడు. వెనకనే వచ్చిన వినయ్, అనూరాధను అక్కడే వుండమని తను కారు నడపుతూ ఆఘ మేఘాల మీద ఆస్పత్రికి చేర్చాడు.

ప్రైవేటు ఆసుపత్రి కావడాన క్షణాల్లో నర్సులు, డాక్టర్లు వచ్చి చూసారు. ఎముక ఫ్రాక్చర్ అయిందని చెప్పి కట్టుకట్టి, ఆరు వారాలు కదలకుండా విశ్రాంతి తీసుకోవాలనీ, కాలిమీద ఎటువంటి బరువు మోపకూడదని చెప్పారు. నొప్పి తగ్గడానికి మాత్రలు, మందులు రాసి ఇచ్చారు. అన్నిటికీ కలిపి అయిదువేల రూపాయలు చెల్లించి వాడిపోయిన ముఖాలతో ఇంటికి చేరారు అహల్య, గౌతమ్, వినయ్‌లు.

అహల్య గౌతమ్‌తో బాటు ఊరికి వెళ్ళి రెస్ట్ తీసుకుంటానంటే అనూరాధ కోప్పడింది. ఆఫీసుకు సెలవు పెట్టి తన దగ్గరే వుండి విశ్రాంతి తీసుకోమని గట్టిగా చెప్పింది.

"ఇదిగో అంతా ఈయన మూలానే జరిగింది. ఈ పెళ్ళికి రానో మొర్రో అంటే కోపగించుకుని, అలిగి తీసుకువచ్చారు. లక్షణంగా మా కొలీగ్స్‌తో ఊళ్ళన్నీ తిరిగి సరదాగా గడిపి రావల్సిన దాన్ని ఇలా

మంచాన పడేట్టు చేసారు. ఈ పెళ్ళి నా చావుకి వచ్చినట్టుంది'' అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది అహల్య.

గౌతమ్ ముఖం చిన్నబోయింది. తన వలన యాత్రలకు పోలేక పోగా కాలు విరిగిందన్న ఆరోపణ అతన్ని కలచివేసింది.

మరిది ముఖం చూసి జాలిపడిన అనూరాధ అహల్యను ఓదార్చబోయింది. ''అవేం మాటలే? పెళ్ళికి రాబట్టే పడి కాలు విరగ్గొట్టుకున్నానని అనుకుంటున్నావుగానీ మనకు రాసి పెట్టివుంటే ఎక్కడైనా ప్రమాదం జరగవచ్చును'' అంది. ''నాకే ఎందుకిలా జరగాలి? హాయిగా టూర్ వెళ్ళి ఇక్కడకు రాకపోతే, ఇలా పడే ప్రసక్తే వుండేది కాదు. తల వ్రాత, జరిగేది ఎలాగైనా జరుగుతుంది అంటూ వేదాంతం చెప్పకు అక్కా. ఆయనకు కావల్సింది తన వాళ్ళ పెళ్ళికి అందరం రావడం. ఆ పెళ్ళి మూలాన నా కాలు విరిగి నేనెంత బాధ పడితే ఆయనకేం? నా ఖర్మ బాగులేక ఆయన మాటలు విని బంగారంలాంటి యాత్రా ప్రయాణం వదలుకుని ఈ పెళ్ళికి తగలబడి ఇలా మంచాన పడ్డాను'' వుక్రోషంగా అంది అహల్య.

గౌతమ్ జవాబు చెప్పలేనట్టు తప్పుచేసిన వాడిలా నిలబడిపోయాడు.

ఆరు వారాల పాటు అహల్య అక్కగారింట్లో వుండిపోయింది. ఆ నెలన్నరా గౌతమ్ బంధువు ఒకామె వచ్చి పిల్లలకు, అతనికి సాయంగా వుంది. వారానికోసారి వచ్చి అహల్యను చూసి వెళ్తున్నారు గౌతమ్, పిల్లలు.

కట్టు విప్పి, ఎముక పూర్తిగా అతుక్కున్నదనీ అయినా కాస్త జాగ్రత్తగా వుండాలనీ సూచనలు ఇచ్చి ఇంటికి పంపించారు డాక్టర్లు.

వినయ్ అనూరాధ తమ కారులో అహల్యను తీసుకువచ్చి కర్నూల్లో వదలి వెళ్లారు.

మర్నాడు ఆఫీసుకు వెళ్ళింది అహల్య. ఆమెను చూసిన సహోద్యోగులందరూ పరామర్శించారు. అందరూ ఇంచుమించుగా ఒకే భావాన్ని వెలిబుచ్చారు 'దేవుడి దయ వలన ఇంకే ప్రమాదం కాకండా ఫ్రాక్చర్‌తో బయట పడ్డారు'అని.

ఇంటికి వచ్చాక గౌతమ్‌తో ఆ మాట చెప్పింది అహల్య ''ఏమిటో వీళ్ళ వాలకం చూస్తే నాకేదో పెద్ద ప్రమాదం జరగాల్సింది తప్పిపోయింది అన్నట్టుగా మాట్లాడుతున్నారు'' అని కూడా అన్నది.

''మామూలుగా అంటుంటారు కదా...'' మనకు రాసి పెట్టి వుంటే ఎక్కడైనా ఈ ప్రమాదం జరిగేది అని... అలాగే ఆ మాట అని వుంటారు ఫ్రాక్చర్ అనేది ఎంత బాధాకరమైనదైనా ప్రాణం తీసేది కాదు కదా అని వాళ్ళ వుద్దేశమేమో! అన్నాడు గౌతమ్, ఆమె వైపు చూడకుండా అన్నం పళ్ళెం వైపు చూస్తూ.

''ఆఁ.. అనుభవించే వాళ్ళకు తెలుస్తుంది ఆ బాధ, నొప్పి... దంత వేదాంతాలకేం? ఎన్నయినా మాట్లాడవచ్చు...'' విసుగ్గా అంది అహల్య.

మర్నాడు ఆఫీసుకు వెళ్ళిన అహల్య తమ సహోద్యోగి కమల కనబడక పోవడంతో ఆ విషయం తన సీటు పక్క సీటులో కూర్చున్న నిరంజన్‌ని అడిగింది.

''మేడమ్ మీకు కమలగారి గురించి ఎవరూ ఇంత వరకు చెప్పలేదా?'' అనడిగాడతను ఆశ్చర్యంగానూ, విచారంగానూ.

''ఏవయింది? ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళిపోయారా? తను లేకపోతే ఆఫీసులో సందడే లేదు... చాల ఫ్రెండ్లీ మనిషి కదా...'' అన్నది అహల్య.

''పోయిన నెల మనవాళ్ళంతా వారంపాటు ముఖ్యమైన పుణ్యక్షేత్రాలు చూడాలని టూర్ వేసుకున్నారు కదా! కమలగారు తనూ వెళ్ళాలని నిర్ణయం తీసుకునే సరికి బస్ నిండిపోయింది. అనుకోకుండా ఆఖరి నిముషంలో మీరు ఏదో పెళ్ళికి వెళ్ళాలని ఆ ప్రయాణం మానుకున్నారు. మీరు వెళ్ళాల్సిన సీట్లో కమలగారు వెళ్లారు. విజయవాడ దగ్గర స్పీడుగా వస్తున్న లారీ బస్‌ని గుద్దిందట. మిగతా వారంతా చిన్న గాయాలతో బయటపడ్డారు గానీ కమలగారు ప్రాణాలు పోగొట్టుకున్నారు'' చెప్తున్న నిరంజన్ కళ్ళలో నీళ్ళు నిండాయి.

కమల చనిపోయిందన్న వార్త అశనిపాతంలా సోకింది అహల్యకు. అలా నోటమాట రానట్టుగా కూర్చుండిపోయింది. ఆవిడ మనసు చెదరి వుందని గ్రహించిన నిరంజన్ అహల్యను ఇంటికి తీసుకువచ్చి వదిలాడు. గౌతమ్‌కి ఫోను చేసి పిలిపించి, అతను వచ్చాక తను ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

గౌతమ్ అహల్యను చేతుల్లోకి తీసుకుని గుండెల్లోకి పొదవుకున్నాడు.

''కమలకు ఇద్దరు చిన్న పిల్లలున్నారు... తల్లి లేకుండా వాళ్ళకెలా? ఆ సీటులో అసలు నేను ప్రయాణం చేయాల్సింది. నేను పెళ్ళికి రాకండా వెళ్ళి వుంటే నా పిల్లలు... అలాగే తల్లిలేని పిల్లలయ్యేవారు. మీరు...పాపం కమల...'' అంటూ ఏదేదో మాట్లాడుతున్న అహల్యకు నిద్ర మాత్ర ఇచ్చి పడుకోబెట్టాడు గౌతమ్.

''ఏ అదృశ్య హస్తం కమలను యాత్రలకు, అహల్యను పెళ్ళికి పంపింది? ఎందుకిలా జరిగింది అన్న అహల్య ప్రశ్నకు దేవుడే సమాధానం చెప్పాలి'' అనుకుంటూ ఎదురుగా వున్న ఏడు కొండల స్వామి పటానికి నమస్కరించాడు గౌతమ్.

*



## ప్రియాంక 'గోల్డ్' ధమాకా....

'గోల్డ్' ధమాకా అంటే బంగారం గోల కాదు. స్విమ్ సూట్ ముచ్చట ఇది. తారలు స్విమ్ సూట్ వేసుకొని ప్రేక్షకులకు కనువిందు చేయడం కొత్త కాదు. అయితే స్విమ్‌సూట్ వేసుకోవడం ఇష్టమే...కానీ ఆ రంగే నచ్చలేదంటూ అందాల ప్రియాంక ఓ మెలిక పెట్టింది. ప్రియాంకకు గులాబీ రంగంటే మహా ఇష్టం. తన కాస్ట్యూమ్స్‌లో ఆరంగు ఉన్న డ్రస్‌లకి ఎక్కువ ప్రాముఖ్యాన్ని ఇస్తుంది ప్రియాంక. ఈ నేపథ్యంలో తరుణ్ మాన్సుకాని 'దోస్తానా'లో ఓ సీన్‌లో స్విమ్ సూట్‌లో నటించాల్సి ఉంది. తన అలవాటు ప్రకారం గులాబీరంగు స్విమ్‌సూట్ అయితే బాగుంటుందని ప్రియాంక అడిగింది. ఈ సినిమాలో ప్రియాంక కోసం డిజైనర్ మనీషా మల్‌హోత్రా గోల్డ్ కలర్ స్విమ్‌సూట్ డిజైన్ చేశాడు. ఆ రంగు ప్రియాంకకి నచ్చలేదు. దానిని వేసుకోవడానికి ఆమె విముఖత చూపింది. అయినా మల్‌హోత్రా పట్టు విడవకుండా ఆ రంగు ఆమెకు చాలా బాగా నప్పుతుందని, ఓ సారి వేసి చూసుకొమ్మని కన్విన్స్ చేశాడు. మల్‌హోత్రా మాట కాదనలేక ప్రియాంక ఆ డ్రస్ వేసుకొని అద్దంలో ఓసారి చూసుకుంది. అంతే..! షాక్ తిన్నది. ఆ డ్రస్ నచ్చక కాదు. ఆ రంగు తనకు అంత బాగా నప్పుతుందని ఆమె అస్సలు ఊహించలేదు. దాంతో ఆ డ్రస్‌కు ఓకే చెప్పేసింది. ఇక నుంచి గోల్డ్ కలర్ డ్రస్‌లలోనే ప్రియాంక దర్శనమిస్తుందో ఏమో మరి!